సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



రూ.లక్ష విరాళం


మలికిపురం: మేడిచర్లపాలెం మహిమ క్రీస్తు మందిరంలో కొత్త సౌండ్ సిస్టమ్ కొనుగోలుకు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు.

వెండి చీర సమర్పణ



తాళ్లరేవు: స్థానిక శివాలయంలో భద్రకాళీ అమ్మవారికి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ సూర్యనారాయణ రూ.3.50 లక్షల విలువైన 3 కిలోల బరువైన వెండి చీర సమర్పించారు.

కాలువలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఊపిరి తిత్తుల మార్పిడికి రూ.20 లక్షల సాయం

- క్యాన్సర్ బాధితురాలికి రూ.నాలుగు లక్షల అందజేత
- సీఎం జగన్‌కు బాధిత కుటుంబీకుల కృతజ్ఞతలు



ఆనందం వ్యక్తం చేస్తున్న కంచర్ల అయ్యప్ప

అమలాపురం రూరల్: కామనగరువు ఎంఎస్ఎస్ కాలనీకి చెందిన కంచర్ల భైరవమూర్తికి ఊపిరి తిత్తుల మార్పిడి చేయడానికి రూ.20 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయ్యాయి. ఆదివారం స్థానిక యెంటూరి కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఈ విషయం తెలిపారు. సమావేశం వద్దకు వచ్చిన బాధితుడు సోదరుడు కంచర్ల అయ్యప్ప మాట్లాడుతూ జ్యూస్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సోదరుడు భైరవమూర్తికి ఊపిరి తిత్తులు పనిచేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డామని చెప్పారు. ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లితే రూ.60లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారన్నారు. ఈ విషయాన్ని తమ సంఘం నాయకులు మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన నిధులు మంజూరు చేయించారని తెలిపారు. తన సోదరుడు హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రితో వైద్యం పొందుతున్నాడని చెప్పాడు. అదేవిధంగా తన కుమార్తె సంతోషికి క్యాన్సర్ రావడంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ. 4లక్షలు సాయం చేయడంతో వైద్యం జరిగిందని చెక్కా రమేష్ తెలిపాడు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని బాధితుల కుటుంబీకులు తెలిపారు.

చలో విజయవాడకు అనుమతుల్లేవు

అమలాపురం టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆంధ్రప్రదేశ్ ఐక్య కార్యాచరణ సమితి (ఏపీజేఏసీ) ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ నుంచి అనుమతులు లేవని ఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. జిల్లాతోపాటు విజయవాడ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న దృష్ట్యా అనుమతులు లేని చలో విజయవాడకు ఎవరూ వెళ్లవద్దని ఎస్పీ సూచించారు. పోలీసు అనుమతుల లేని ఆ కార్యక్రమానికి జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్ల సంఘాల వారు వెళ్లి పోలీసుశాఖ చట్టపరంగా తీసుకునే చర్యలకు బాధ్యులు కావద్దని ఎస్పీ శ్రీధర్ హితవు పలికారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్ కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన– జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన లింగాల వెంకట రమేష్ రూ.50,116 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

28న రీజినల్ జాబ్‌మేళా

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వీఎల్‌పురంలోని మార్గాని ఎస్టేట్ ఆవరణలో ఈనెల 28న తేదీన రీజినల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 100 కంపెనీలలో సుమారు 4,000 పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అన్ని జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈఎం, ఫార్మసీ చదివినవారు పాల్గొనవచ్చునని తెలిపారు. వివరాలకు 96031 61039, 96760 52454, 8919 684670 నంబర్లలో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

● పవర్(లెస్) స్టార్

గ్రాఫ్ ఢమాల్

- జనసేన శ్రేణుల ఆగ్రహం
- పొత్తుల పేరుతో చిత్తు చేశారంటూ మండిపాటు
- నెత్తిన పెట్టుకున్న వారే నిప్పులు చెరుగుతున్న వైనం
- చిరిగిన పవన్ కల్యాణ్ చిట్టీ



రావులపాలెం కాపు కల్యాణ మంటపంలో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో నెలకొన్న గందరగోళం



ఆలమూరులో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని చించి వేస్తున్న జనసేన నాయకులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: టీడీపీతో పొత్తు తమ పార్టీని చిత్తు చేసిందనే జనసేన శ్రేణుల ఆవేదన కాస్తా.. అధినేత పవన్ కల్యాణ్‌పై తీవ్ర ఆగ్రహంగా మారింది. ఆయనతో పాటు జనసేన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. నిన్నమొన్నటి వరకూ ఆహా ఓహో పవన్ కల్యాణ్‌ను నెత్తిన పెట్టుకున్న నేతలు, అభిమానులే ఇప్పుడు ఆయనను దుమ్మెత్తిపోస్తున్నారు. జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు స్థానాలు అని పవన్ ప్రకటించడంపై నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి గళం విప్పింది. పొత్తుల తీరుతో పవర్ స్టార్ కాస్తా ఒక్కసారిగా 'పవర్‌లెస్' స్టార్ అని నిరూపణ అయిపోయిందని దుయ్యబడుతున్నారు. తమ కష్టాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారంటూ మండిపడుతున్నారు. గౌరవప్రదమైన స్థాయిలో సీట్లు సాధించకుండా ఓట్ల షేరింగ్ అసాధ్యమంటూ నిప్పులు చెరుగుతున్నారు. గడచిన పదేళ్లుగా పార్టీనే నమ్ముకుని అనేక కార్యక్రమాలు చేస్తున్న విషయాన్ని పక్కన పెట్టి టీడీపీ ఏకపక్షంగా సీట్లు కేటాయించుకోవడంతో జనసేన వర్గాలు రగిలిపోతున్నాయి.

ఏదో మార్పు కోసం వచ్చిన పార్టీగా పవన్ చెప్పిన సినిమా డైలాగులు నమ్మి మోసపోయామంటూ వివిధ స్థానాల్లో సీట్లు ఆశించి భంగపడిన నేతలు వేదన చెందుతున్నారు. ఐదేళ్లుగా పార్టీ జెండా బుజాన వేసుకుని రేయింబవళ్లు ఊరూవాడా తిరిగిన పాపానికి చంద్రబాబుకు తమ సీట్లు తాకట్టు పెట్టేశారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిల నుంచి ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా సీట్ల తగ్గింపుతో పాటు కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ పవన్ తీరుపై నిరసన జ్వాలలు మిన్నంటుతున్నాయి. చంద్రబాబు చెప్పినట్టు తలాడించి, దానికి రాష్ట్ర ప్రయోజనాలు అంటూ బిల్డప్ ఇవ్వడం ఎందుకనే చర్చ ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్న సీనియర్ల మధ్య జరుగుతోంది. అసలు 24 సీట్లకు పరిమితం కావడానికి ఎంచుకున్న ప్రాతిపదిక ఏమిటనే దానిపై పార్టీ శ్రేణులకు స్పష్టత ఇవ్వాల్సిన నైతిక బాధ్యత పవన్‌పై ఉందని అంటున్నారు. గత ఎన్నికల్లో తమ సహకారంతో టీడీపీ గెలుపొందిన స్థానాలను ఇప్పుడు కూడా టీడీపీకే కట్టబెట్టడంపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలతో పాటు పార్టీ కార్యకర్తలు మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఆశించి భంగపడిన నేతలు ఆదివారం తీవ్ర నిరసన వ్యక్తం చేసి రోడ్డెక్కి, పవన్ తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు.

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కట్టబెట్టిన జగ్గంపేట సీటును ఆశించి, అక్కడి జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్రరావు భంగపడ్డారు. సామాన్యులైన తనవంటి వారు రాజకీయాల్లోకి వచ్చి, ఎమ్మెల్యేలు అవ్వాలనుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు హితవు పలికారు. అంతటితో ఆగకుండా పవన్ నిర్ణయంపై ఆగ్రహంతో గోకవరం మండలం అచ్యుతాపురంలో తన ఇష్ట దైవమైన కనకదుర్గ ఆలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి సతీసమేతంగా తనువు చాలిస్తానంటూ 'అంతిమ ఆమరణ దీక్ష' చేపట్టారు. తన జీవితం ఒక గుణపాఠంగా ఉండాలని, తనలాంటి సామాన్యులు రాజకీయాల్లోకి వచ్చి జీవితాలు నాశనం చేసుకోకూడదనే విషయం నలుగురికీ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ దీక్ష చేపట్టానని చెప్పడం గమనార్హం. 48 గంటల్లో పార్టీ అధ్యక్షుడు స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆ పార్టీ గోకవరం మండల అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం తదితరులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు.
- పెద్దాపురం సీటును మూడోసారి కూడా టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ఇచ్చేస్తే ఇక జనసేన ఎందుకంటూ ఆ పార్టీ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి సహా నియోజకవర్గ నేతలు మండిపడుతున్నారు. పెద్దాపురం మండలం పులిమేరులో సమావేశమైన ఆ పార్టీ నేతలు పవన్ నిర్ణయాన్ని తూర్పారబట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పదవికి పిట్టా జానకీరామారావు రాజీనామా చేసి, పవన్ వైఖరిని ఖండించారు.



గోకవరం మండలం అచ్యుతాపురంలో ఆమరణ నిరాహార దీక్షలో పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు

- కొత్తపేట నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌కు సీటు ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు కారాలు మిరియాలు నూరుతున్నారు. సీటు విషయంపై తాడోపేడో తేల్చుకుంటామని మండిపడుతున్నారు. ఆ నియోజకవర్గంలోని మండల కేంద్రం ఆలమూరులో జనసేన పార్టీ కార్యాలయం వద్ద నేతలు పార్టీ ఫ్లెక్సీలను దహనం చేశారు. చల్లా బాబీ, గుత్తుల నాగేశ్వరరావు తదితరులు, మాట్లాడుతూ, తక్కువ సీట్లకు ఒప్పుకున్నారని, తాము బలంగా ఉన్న కొత్తపేట నియోజకవర్గంలో సీటు ఇవ్వకుండా విస్మరించారని నిరసన తెలిపారు. జనసేన గెలుపొందే సీటులో ఇలా అన్యాయం చేయడం ఏమిటంటూ నిప్పులు చెరిగారు.
- ముమ్మిడివరంలో టిక్కెట్టు ఆశించి భంగపడిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ వర్గీయులు ఆ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. పవన్ నిర్ణయంపై తాడోపేడో తేల్చుకునేందుకు బాలకృష్ణ తన అనుచరులతో కలిసి ఆదివారం విజయవాడ వెళ్లారు.
- పి.గన్నవరం నియోజకవర్గ సీటును టీడీపీకి కట్టబెట్టడంతో దీనిపై ఆశలు పెంచుకుని, తెలంగాణ పోలీసు కమిషనరేట్‌లో చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన గిడ్డి సత్యనారాయణ పరిస్థితి డోలాయమానంలో పడింది. ఆయన వర్గీయులు పవన్ ఇలా చేస్తారా అంటూ మండిపడుతున్నారు.
- గత ఎన్నికల్లో గెలుపొందిన రాజోలు సీటుపై కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో అక్కడి పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
- పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడైన కందుల దుర్గేష్ సీటు మార్చేసే ప్రయత్నాలు ఆ వర్గానికి రుచించడం లేదు. మొదటి నుంచీ ఆరు నూరైనా రాజమహేంద్రవరం రూరల్ సీటు పార్టీ అధ్యక్షుడిగా దుర్గేష్‌కు ఖాయమని చెబుతూ వచ్చారు. కానీ చివరి నిమిషంలో చంద్రబాబు చెప్పినట్టే పవన్ తలాడిస్తూ రూరల్ స్థానాన్ని గోరంట్ల బుచ్చయ్య చౌదరికి కట్టబెట్టే సంకేతాలు ఇవ్వడంపై రూరల్ జనసేన నేతల నుంచి నిరసనలు మిన్నంటుతున్నాయి. ఐదేళ్లుగా రూరల్‌లో పార్టీని బలోపేతం చేసుకుంటే ఇప్పుడు హఠాత్తుగా నిడదవోలు నియోజకవర్గం వెళ్లమంటే ఎలా త్యాగం చేస్తామని దుర్గేష్ వర్గీయులు పవన్‌ను నిలదీస్తున్నారు.
- మొత్తం మీద సీట్ల తగ్గింపు, బలముందని జనసేన భావిస్తున్న స్థానాలను సైతం టీడీపీకి విడిచిపెట్టేసి పార్టీని గోదారిలో కలిపేస్తారా అంటూ జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపేట సీటుపై పవన్ పునరాలోచించాలి

- నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్
- కాపు కల్యాణ మంటపంలో కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రీనివాస్

రావులపాలెం: ఇటీవల ప్రకటించిన టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో కొత్తపేట నియోజకవర్గం నుంచి టీడీపీకి సీటు కేటాయించడంపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పునరాలోచన చేయాలని ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కోరారు. పవన్‌కళ్యాణ్ నిర్ణయం తేలే వరకు కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ఆదివారంస్థానిక కాపు కల్యాణ మంటపంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు తోట స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బండారు శీను ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కార్యకర్తల అభిప్రాయాలు, నాయకులు అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జనసేనకు కొత్తపేట సీటును కేటాయించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేసినా తమ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్ణయమే తమకు శిరోధార్యంగా మాట్లాడారు. ఈ సమయంలో సమావేశంలో కాస్త గందరగోళం నెలకొంది. అయితే నాయకులు వారించడంతో అందరూ కూర్చున్నారు. ఈ సందర్భంగా బండారు శీను మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం కొత్తపేట నియోజకవర్గంలో ఎంతో కష్టపడ్డామని, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తమ దేవుడని ఆయన పైన ఉన్న అభిమానంతో తనతో పాటు యువత పార్టీలోకి వచ్చారని అన్నారు. ఆ బలంతోనే 2019 ఎన్నికల్లో పోటీ చేసి 37 వేల ఓట్లు సాధించుకున్నామన్నారు. రాష్ట్రంలోనే జనసేన బలంలో ఐదవ స్థానంలో ఉన్న కొత్తపేటలో టీడీపీకి సీటు కేటాయించడంపై తాము ఏమి మాట్లాడలేని స్థితిలో ఉన్నామని, ఏదేమైనా పార్టీ కోసం తామంత పని చేస్తామని అన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొత్తపేట సీటుపై పవన్ కళ్యాణ్‌ని పునరాలోచన చేయమని కోరుతామని, కొంత సమయం కార్యకర్తలంతా వేచి ఉండాలని కోరారు. అయితే ఇటీవల రాజమహేంద్రవరం వచ్చినప్పుడు కూడా కొత్తపేట సీటు జనసేనకేనని ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకోమని తనకు నాయకులు చెప్పారని శ్రీను అన్నారు. అయితే జాబితాలో జనసేనకు సీటు లేకపోవడం తమకే అర్థం కావట్లేదని అన్నారు. జనసేన నాయకులు సూరపురెడ్డి సత్య, చేకూరి కృష్ణంరాజు, కంఠంశెట్టి చంటి, సలాది రామకృష్ణ, బండారు బాబీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దయతో తెలుగు రాష్ట్రాలు బాగుండాలి

- తెలంగాణ ఎమ్మెల్సీ కవిత
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం



ముంగండలో ముత్యాలమ్మను దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్సీ కవిత

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని ముత్యాలమ్మ వారి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలని, అన్ని విధాలా అభివృద్ధి చెందాలని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. దాతల సహకారంతో రూ.కోటి వ్యయంతో పునర్నిర్మించిన ముత్యాలమ్మ వారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్సీ కవిత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని నన్నయ యూనివర్శిటీ న్యాయాధికారి నందెపు నాగేంద్రరావు నివాసం వద్ద కవిత విలేకరులతో మాట్లాడారు. సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బ్రిటిష్ పాలనలో ముంగండ గ్రామస్తులు తలవంచకుండా ఆంధ్ర పౌరుషాన్ని తెలియజేశారని అన్నారు. ముత్యాలమ్మ ఆలయాన్ని గ్రామస్తులు అద్భుతంగా నిర్మించారని ఆమె అభినందించారు. ఈసందర్భంగా కవితను నాగేంద్రరావు దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన కుటుంబ సభ్యులు కవితకు హారతులిచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఆధ్వర్యంతో ఆమెకు వేద పండితులు ఆశీర్వాదం అందించారు. స్వామి శేష వస్త్రాలను, ప్రసాదాన్ని అందించారు.అంతర్వేది నర్సింహ స్వామి, అయినవిల్లి వినాయక స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- 85.23 శాతం మంది హాజరు
- ఉదయం 9.30 గంటలకే కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులు



పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీధర్



సెల్‌ఫోన్లు డిపాజిట్ చేయిస్తున్న అధికారులు

రాయవరం: ఏపీపీఎస్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూపు–2 పరీక్ష జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. 2023 డిసెంబర్ 7న ఏపీపీఎస్‌సీ 897 గ్రూపు–2 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. జిల్లాలో 33 పరీక్షా కేంద్రాల్లో 10,788 మంది హాజరు కావాల్సి ఉండగా 9,195 (85.23 శాతం) మంది పరీక్ష రాశారు. 1,593 మంది గైర్హాజరయ్యారు. జిల్లాను 11 రూట్లుగా విభజించి ఆఫీసర్లను నియమించారు. రూట్ ఆఫీసర్లు ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేసి, పరీక్ష అనంతరం వాటిని రిసీవ్ చేసుకుని, జిల్లా కేంద్రానికి భద్రంగా చేరవేశారు. 33 పరీక్షా కేంద్రాల్లో 33 మంది సీఎస్‌లు, 33 మంది లైజనింగ్ అధికారులు, 475 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారు. అధికారులు తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా 99శాతం మంది అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. అభ్యర్థులతో వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులతో పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాలు కిటకిటలాడాయి. 10.15గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి ఏ ఒక్కరినీ అనుమతించలేదు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఇతరులను అనుమతించలేదు. హాల్ టికెట్‌తో పాటు ఏదో ఒక గుర్తింపు కార్డు చూపిస్తేనే అభ్యర్థులను పోలీసులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల 144 సెక్షన్ అమలు చేశారు. కొందరు సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లతో రావడంతో పరీక్షా కేంద్రం వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసి, అందులో భద్రపర్చుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లా అధికారులు పలు కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభ్యర్థులు వచ్చే వరకు పరీక్షా కేంద్రాల బయట నిరీక్షించారు. ఎండ ప్రభావం ఉండడంతో అభ్యర్థుల వెంట వచ్చిన వారు ఇబ్బంది పడడం కన్పించింది. అభ్యర్థుల పిల్లలను ఆడిస్తూ వారి కుటుంబ సభ్యులు సమయాన్ని గడిపారు.



పరీక్షా కేంద్రంలోకి అనుమతించే ముందు హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న పోలీసులు

ఎస్పీ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు

అమలాపురం టౌన్: గ్రూప్–2 పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా పోలీసుశాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. 33 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహణను ఎస్పీ సునరావు శ్రీధర్ పర్యవేక్షించారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలను జేసీ నుపూర్ అజయ్, ఎస్పీ శ్రీధర్ స్వయంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆయా పోలీసు సబ్ డివిజన్ల డీఎస్పీలకు ఎస్పీ సూచనలు చేశారు. ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా కూడా పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ శ్రీధర్ సందర్శించి బందోబస్తును సమీక్షించారు. కొత్తపేట డీఎస్పీ వెంకటరమణ, రావులపాలెం రూరల్ సీఐ రామ్‌కుమార్, కొత్తపేట ఎస్సై అశోక్‌లకు బందోబస్తు పరంగా ఎస్పీ పలు సూచనలు చేశారు.

పేదల సంక్షేమానికి కృషి



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

ఆత్రేయపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేసినట్లు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఆత్రేయపురంలో రూ.2 కోట్లతో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో చెరువు చుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్ రౌండ్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రంగనాథరాజు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న జగ్గిరెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అనంతరం రుడా పార్కును ప్రారంభించి వేదికపై అల్లూరి సీతారామరాజు విగ్రహన్ని ఆవిష్కరించి సభా వేదికపై పలువురు ప్రసంగించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రముఖుల్ని సన్మానించారు. గౌడ పేట వద్ద సర్దార్ పాపన్న గౌడ్ భారీ విగ్రహన్ని ఆవిష్కరించారు. తొలుత ర్యాలి గ్రామంలో రజక కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో దివంగత నేత పేర్చేర్ల నరసింహరాజు విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాష్‌రావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ షర్మిలారెడ్డి, మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, కొత్తపేట ఎంపీపీ మార్గని గంగాధరం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులను మోసగించిన ఇద్దరికి రిమాండ్

అల్లవరం: రైతుల నుంచి చేపలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా పరారైన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు అమలాపురం కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించిందని ఎస్సై జి.హరీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామానికి చెందిన పినిశెట్టి బాబీ, అల్లవరం మండలానికి చెందిన కొంత మంది రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో చందన కాలసి, సంజయ్ కాలసీలను అరెస్టు చేశామన్నారు. ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లోని రైతుల నుంచి భారీగా చేపలు కొనుగోలు చేశారని, రైతులకు చెల్లించవలసిన రూ.1 కోటికి పైగా చెల్లించకుండా ఒడిస్సా రాష్ట్రం పారిపోయారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ వీరబాబు ఆధ్వర్యంలో విచారణ చేశామన్నారు. ఒడిశాలో ఉన్న ఆ ఇద్దరిని చాకచక్యంగా అరెస్టు చేసి అమలాపురంలోని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు. నిందితుల నుంచి కారును స్వాధీనం చేసుకున్నామని, వారిని రాజమహేంద్రవరం జైలుకి తరలించామని ఎస్సై తెలిపారు. అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై హరీష్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ ఎం. మహేశ్వరరావు అభినందించారు.

హాకీ క్రీడాకారిణుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపికను నిర్వహించారు. హాకీ కోచ్ రవిరాజు పర్యవేక్షణలో ఎంపికైన జిల్లా జట్టు మార్చి 8 నుంచి 10 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగే అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో పాల్గొంటుంది.

27న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

నల్లజర్ల: పురుషుల జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక ఈ నెల 27న తణుకు మండలం మండపాకలో అంబేడ్కర్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.కాంత్, అధ్యక్షుడు కొరు శ్రీను, చైర్మన్ అప్పలరాజు తెలిపారు. క్రీడాకారులు 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన జట్టు విశాఖలో నిర్వహించే 70వ సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు 96424 96117, 94913 33906 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దక్షత కోసం దీక్ష



బోధిస్తున్న ఉపాధ్యాయుడు (అంతర చిత్రం) దీక్ష లోగో

- టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు నిష్ఠ 3.0 కోర్సు
- ఎంఈవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నిష్ఠ 4.0 కోర్సు
- ఆన్‌లైన్‌లో కోర్సు ప్రవేశానికి మార్చి 1 తుది గడువు
- మార్చి 20లోపు కోర్సులు పూర్తి చేయాలని ఆదేశాలు

రాయవరం: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనా పద్ధతులను మెరుగుపర్చుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ఉపాధ్యాయులకు వృత్తిపరమైన మెళకువలను నేర్పేందుకు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ నాలెడ్జ్ షేరింగ్ (దీక్ష)ను ఎన్‌సీఈఆర్‌టీ అందుబాటులోకి తెచ్చింది. దీక్ష అనేది పాఠశాల విద్యలో జాతీయ వేదికగా చెప్పవచ్చు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ఉపాధ్యాయులకు టీచింగ్-లెర్నింగ్ ఈ-కంటెంట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. అభివృద్ధి చేసిన ఈ-కంటెంట్‌ను దీక్ష ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేసి, ఉపాధ్యాయులకు వృత్తిపరమైన నైపుణ్యాలు అందించడానికి కృషి చేస్తున్నారు. దీక్ష ప్లాట్‌ఫామ్‌లో విద్యార్థుల స్థాయికి తగ్గట్టుగా, పాఠ్య పుస్తకాల రూపకల్పన, వీడియోలు, మూల్యాంకనం, ఆడియోలు తదితర కంటెంట్‌తో పాటుగా, డిజిటల్ పాఠ్య పుస్తకాలు పొందుపర్చారు. మన రాష్ట్రానికి సంబంధించిన కంటెంట్‌తో పాటు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యాపరమైన కంటెంట్‌ను కూడా దీక్ష ప్లాట్‌ఫామ్ ద్వారా ఉచితంగా పొందే అవకాశముంది. ఉపాధ్యాయులు వారి బోధన పద్ధతులను మెరుగుపర్చుకునేందుకు, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అనేక కోర్సులు, నవీన బోధనా పద్ధతులను అందుబాటులో ఉంచారు. నేర్చుకున్న ఈ-కంటెంట్‌ను ఉపాధ్యాయులు బోధన-అభ్యసన పద్ధతుల్లో సముచితంగా అనుసంధానించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

రెండు రకాల కోర్సులు

దీక్షలో రెండు రకాల కోర్సులను ప్రవేశ పెట్టారు. నిష్ఠ 3.0లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, 1-5 తరగతులు బోధన చేసే ఏ క్యాడర్‌కు చెందిన ఉపాధ్యాయుడైనా ఈ కోర్సును చేయాల్సి ఉంది. ఈ కోర్సులో 12 రకాల మాడ్యూల్స్ ఉంటాయి. ఈ 12 మాడ్యూల్స్‌ను సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంది. నిష్ఠ 4.0లో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్లు(సీఆర్ఎంటీ) కోర్సులు పూర్తి చేయాలి. ఇందులో ఆరు రకాల మాడ్యూల్స్ ఉంటాయి. ఈ ఆరు మాడ్యూల్స్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలి. ప్రతీ కోర్సు పూర్తి చేయగానే ఆ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. ఇప్పటికే మూడు సార్లు నిష్ఠ కోర్సులను ఆన్‌లైన్‌లో రన్ చేశారు. ఇప్పుడు చివరి అవకాశంగా నాల్గవసారి ఈ కోర్సులను రీరన్ చేస్తున్నారు. గతంలోనే ఈ కోర్సులు చేసి సర్టిఫికేట్లు పొందిన వారు ఇప్పుడు చేయాల్సిన అవసరం లేదు. నిష్ఠ 3.0, 4.0కు సంబంధించి సందేహాల నివృత్తికి జిల్లా స్థాయిలో కోఆర్డినేటర్లను కూడా నియమించారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ల జారీ

నిష్ఠ 3.0, 4.0 కోర్సులకు సంబంధించిన వారికి లింక్‌ను ఇప్పటికే సంబంధిత అధికారుల ద్వారా పంపించారు. ఆ లింక్ ద్వారా మాడ్యూల్స్‌ను ఆన్‌లైన్‌లో చదివి, నేర్చుకున్న అంశానికి సంబంధించి పరీక్షను రాయాల్సి ఉంది. మూడు ప్రయత్నాల లోపల ఈ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సంబంధిత పరీక్షలో 70శాతం స్కోర్ సాధించిన వారు ఆన్‌లైన్ సర్టిఫికెట్‌ను యాప్ ద్వారా పొందుతారు. ఈ కోర్సులు మార్చి 20 వరకు అందుబాటులో ఉంటాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న మండల విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్ఎంటీలు ఆన్‌లైన్ శిక్షణ తీసుకోవాల్సి ఉంది.

మార్చి 1 లోగా ప్రవేశం పొందాలి

బోధన, అభ్యసనం, మూల్యాంకనంలో దీక్ష వినియోగంపై 'దీక్ష' ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ శిక్షణను ఉపాధ్యాయులకు ఇస్తున్నారు. మార్చి 1వ తేదీలోగా నిష్ఠ 3.0, నిష్ఠ 4.0 కోర్సులకు సంబంధించి ప్రవేశం పొంది, కోర్సులు పూర్తి చేయాలి. దీక్ష ప్లాట్‌ఫామ్‌లో లాగిన్లై ఆన్‌లైన్‌లో కోర్సులు పూర్తి చేయాలి. మార్చి 20వ తేదీలోగా ప్రతి ఒక్కరూ వారికి సంబంధించిన మాడ్యూల్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్లు పొందాలి.

వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



ప్రతి ఉపాధ్యాయుడు దీక్ష ఆన్‌లైన్ శిక్షణ పొందాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ పొందడం ద్వారా బోధనాభ్యసన పద్ధతులను మెరుగు పర్చుకునే వీలుంది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు దోహదం చేస్తోంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్దేశించిన ఎంఈవోలు, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు తప్పనిసరిగా కోర్సులు పూర్తి చేయాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జగన్ పాలనలో సంతోషంగా వ్యాపారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

అమలాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో వ్యాపార వర్గాలన్నీ సంతోషంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య రాష్ట్ర విభాగం చైర్మన్ కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం అమలాపురంలో యెంటూరి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం నవరత్నాల ద్వారా సాయం అందిస్తున్న కారణంగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వ్యాపారాలు జోరుగా సాగుతూ వ్యాపార వర్గాలకు సానుకూల పరిస్థితి ఏర్పడిందన్నారు.

జగన్ ప్రభుత్వంలో వ్యాపారులపై వివిధ శాఖల దాడులు తగ్గడంతో వారు స్వేచ్ఛగా వ్యాపారాలు సాగించగలిగారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని చంద్రబాబు విస్మరించగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో నవంబర్ 1వ తేదీనే అధికారికంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించడమే కాక పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందన్నారు. టీటీడీ పాలకమండలిలో చంద్రబాబు ఒక్క ఆర్యవైశ్యునికి కూడా చోటు కల్పించలేదని, వైఎస్ జగన్ ప్రభుత్వంలో ముగ్గురు ఆర్యవైశ్యులకు స్థానం కల్పించారన్నారు. ఆర్యవైశ్యులను కించపరిచేలా ఉన్న చింతామణి నాటకాన్ని జగన్ ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఆర్యవైశ్యుల్లోని 62 వేల మంది పేద మహిళలకు సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వాసవీ అమ్మవారి ఆలయాలు, ట్రస్టులు, ఆస్తులను ఆర్యవైశ్య పాలక మండలికి అప్పగించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్ (నాని), జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శులు తేతలి మోహన్‌రెడ్డి, నూలు రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల శేఖర్, కొల్లూరి మదన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వంకాయల కాశీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా భీమేశ్వరుని తెప్పోత్సవం


సప్తగోదావరిలో దేదీప్యమానంగా సాగిన తెప్పోత్సవం (అంతర చిత్రం) సప్త గోదావరిలో హంస వాహనంపై కల్యాణమూర్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో గల సప్త గోదావరి నదిలో తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ కాంతుల నడుమ తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమూర్తులను వేద పండితులు ఆలయం నుంచి తోడ్కొని వచ్చి సప్తగోదావరిలో విద్యుత్ దీపాలంకరణలతో, పుష్పాలంకృతమైన హంసవాహనంలో ఉంచి ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మూర్తులకు నీరాజన మంత్ర పుష్పాలు సమర్పిస్తుండగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారు మూడు సార్లు నదిలో జలవిహారం చేశారు. వేలాది మంది భక్తులు స్వామివారి తెప్పోత్సవాన్ని తన్మయత్వంతో తిలకించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకరరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాల్లో పాలుపంచుకున్నారు.

విహార యాత్రలో విషాదం

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


పవన్ రత్నాకర్ మృతదేహం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని వేజువాడ గ్రామ సమీపం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుడిస పర్యాటక ప్రదేశాన్ని తిలకించి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన సిద్ధిరెడ్డి పవన్ రత్నాకర్ (22) విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం తుని వెళ్లిన అతను రాజమహేంద్రవరంలోని స్నేహితుల వద్దకు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. వీరు పర్యాటక ప్రదేశమైన గుడిస హిల్ టాప్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం తిరిగి వస్తుండగా మండలంలోని వేజువాడ వద్దకు వచ్చేసరికి పవన్ బైకు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని బోదులూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

నేత్రపర్వంగా స్వామివారి తెప్పోత్సవం


అంతర్వేది చెరువులో నేత్రపర్వంగా సాగిన స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనసింహస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పదోరోజు ఆదివారం స్థానిక మంచినీటి చెరువులో హంస వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది. తొలుత ఆలయం వద్ద నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పక వాహనంపై ఊరేగింపుగా చెరువు వద్దకు అర్చకులు, భక్తులు తోడ్కొనివచ్చారు. తెప్పోత్సవానికి ముందు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు చెరువు వద్ద గంగపూజ నిర్వహించారు. పుష్పక వాహనంపై కొలువుదీరిన స్వామిని అర్చకుల వేదమంత్రాలతో, భక్తుల గోవిందనామస్మరణలతో విద్యుద్దీపాలంకరణలతో ఉన్న తెప్పపైకి అధిరోహింపచేశారు. అర్చకులు, అధికారులు, ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి తెప్పోత్సాన్ని ప్రారంభించారు. మూడు పర్యాయాలు చెరువు చుట్టూ బాణసంచా కాల్పుల మధ్య జరిగిన తెప్పోత్సవం భక్తులను అలరించింది. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు పాల్గొన్నారు. రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యాన ఎస్సై రాము తెప్పోత్సవం భద్రతా చర్యలను పర్యవేక్షించారు. భీమవరానికి చెందిన దాత గొట్టుముక్కల భీమరాజు కైంకర్యంతో తెప్పోత్సవం జరిగింది.

అప్రమత్తతతో తప్పిన ముప్పు

- 108 వాహనంలో ప్రసవం
- ఆస్పత్రిలో మరో బిడ్డ జననం
- తల్లి, కవల పిల్లలు క్షేమం


చొప్పెల్ల వద్ద 108 వాహనంలో ప్రసవించిన ఆడబిడ్డతో తల్లి, వాహన సిబ్బంది

ఆలమూరు: 108 వాహన సిబ్బంది సకాలంలో స్పందించి చాకచక్యంగా వ్యవహరించి వైద్య సేవలు అందించడం వల్ల ఆదివారం తల్లీబిడ్డలకు ప్రాణాప్రాయం తప్పింది. మండలంలోని మూలస్థాన అగ్రహారంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కుటుంబం స్థానిక ఇటుక బట్టీలో పనిచేస్తోంది. అందులో సీతాబాయ్ (29) నెలలు నిండి ఉండటంతో ఈ నెలాఖరులోపు ప్రసవం అవుతుందని, వైద్యారోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు తెలిపారు. ఆదివారం సాయంకాలం సీతాబాయ్‌కు నొప్పులు రావడంతో స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. సత్వరమే చేరుకున్న వాహన సిబ్బంది సీతాబాయ్‌ను 108 వాహనంలో ఎక్కించుకుని చొప్పెల్ల పీహెచ్‌సీకి తీసుకువెళుతున్నారు. 216 ఏ జాతీయ రహదారి చొప్పెల్ల లాకుల వద్దకు వచ్చేసరికి నొప్పులు అధికంగా రావడంతో 108 సిబ్బంది అప్రమత్తమయ్యారు. వైద్యాధికారి డి.సువర్చలాదేవి సలహా మేరకు వైదయసాయం అందించి సులభ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకున్నారు. సీతాబాయ్ గర్భంలో మరొక (కవలలు) బిడ్డ అడ్డ ఉండటంతో ప్రసవం క్లిష్టతరమైంది. ఆమె కడుపులో బిడ్డ అడ్డం తిరగడంతో విషమ పరిస్థితి ఎదురైంది. తల్లీబిడ్డలకు ప్రమాదకరమని తెలియడంతో వారు హుటాహుటిన ఆ గర్భిణిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కూడా ఎంత శ్రమించినా సులభరీతిలో ప్రసవం కాలేదు. దీంతో ఆస్పత్రి వైద్యులు గర్భిణీని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి శస్త్రచికిత్స చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 108 వాహనంలో తొలుత జన్మించినది మగ బిడ్డ కాగా రెండవ బిడ్డకు శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడింది. సీతాభాయ్‌కు ఇది ఐదవ కాన్పు కాగా తొలి నాలుగు విడతలు సాధారణ ప్రసవలే జరిగాయని, ఐదవ విడత మాత్రం కవల పిల్లలు పుట్టారని ఈటీ భారతి తెలిపారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకువచ్చి తల్లి బిడ్డను రక్షించిన 108 సిబ్బందిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అభినందించారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్ రెండవ రోజు ఆదివారం మరింత ఉత్సాహంగా కొనసాగింది. శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో టోర్నమెంట్ ప్రారంభం అయిన విషయం విదితమే. రెండవ రోజు పురుష విభాగంలో పశ్చిమ గోదావరిపై ప్రకాశం, తూర్పుపై విజయనగరం, చిత్తూరుపై విశాఖ, నెల్లూరుపై శ్రీకాకుళం, కడపపై అనంతపురం విజయం సాధించాయి. బాలికల విభాగంలో కడపపై పశ్చిమ, గుంటూరుపై విశాఖ, ప్రకాశంపై కర్నూలు, పశ్చిమ గోదావరిపై తూర్పు, అనంతపురంపై కడప, విశాఖపై నెల్లూరు విజయం సాధించాయి. కాగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పురుషుల విభాగంలో గుంటూరు- శ్రీకాకుళం, విశాఖ- కృష్ణ, అనంతపురం- విశాఖ, బాలికల విభాగంలో ప్రకాశం విశాఖ, శ్రీకాకుళం తూర్పు, నెల్లూరు విశాఖ, శ్రీకాకుళం కృష్ణ జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఎంప్లాయిస్ టీము, కర్నూలు మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి కె.పట్టాభిరామమ్, టోర్నమెంట్ నిర్వాహక అధ్యక్షుడు ఉబా జాన్‌మోజెస్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 60 మంది న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో ఉత్తమ క్రీడాకారులతో రాష్ట్ర స్థాయి పురుషుల, స్త్రీల టీములను ఎంపిక చేస్తారు. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2వ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆ టీములు పాల్గొంటాయి.


ఎంప్లాయిస్ టీము - కర్నూలు మధ్య జరిగిన పోటీ

బరువులు ఎత్తారు... సత్తా చాటారు


పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి


పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అమలాపురంలో గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనంలో ఆదివారం జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ వుమెన్ -2024 పోటీల్లో క్రీడాకారులు బరువులు ఎత్తి సత్తా చాటారు. పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పోటీల్లో 96 మంది పవర్ లిఫ్టర్లు పాల్గొని బరువులు ఎత్తారు. పోటీలను 9 విభాగాలుగా నిర్వహించినట్లు కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతల వివరాలను ఆయన వెల్లడించారు. మహిళా విభాగానికి సంబంధించి 66 కేజీల విభాగంలో జి.సుభద్ర (మలికిపురం), యు.శశికళ (అమలాపురం), ఎం.దుర్గ (అమలాపురం), 66 కేజీల పైన విభాగంలో ఎం.శ్రేయ (తణుకు), పి.వందన (అమలాపురం), సీహెచ్. హారిక (రామచంద్రపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. స్ట్రాంగ్ వుమెన్ విన్నర్‌గా ఎం.శ్రేయ (తణుకు), రన్నర్‌గా పి.వందన (అమలాపురం) నిలిచారు. మాస్టర్స్‌కు సంబంధించి 40 – 50 ఏళ్ల వయసు విభాగంలో డీఆర్‌కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ), సీహెచ్ కిరణ్‌కుమార్ (అమలాపురం), డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 50 -60 ఏళ్ల వయసు విభాగంలో జీఎస్ఎన్ మూర్తి (అమలాపురం), ఏఎస్ సత్యనారాయణ (అమలాపురం), ఎమ్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) వరసగా మొదటి మూడు స్థానాలను గెలుచుకున్నారు. మెన్స్ విభాగం పోటీలు అర్ధరాత్రి వరకూ జరగనున్నాయని కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం 2వ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు దంపతుల నేతృత్వంలో జరిగిన ఈ పోటీలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటిద్దు వెంకన్నాయుడు పర్యవేక్షించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దొమ్మేటి వెంకటరమణ, డీవీవీ సత్యనారాయణ, ఎంవీ సముద్రం, ఎం.లక్ష్మీ నారాయణ , కె.బాలకృష్ణ వ్యవహరించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, డాక్టర్ గంధం విశ్వనాథం, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను విజేతలకు బహుమతులు అందజేశారు.